సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలి



పద్మశ్రీ కృష్ణ యాదవ్‌కు నియామక పత్రం అందజేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

చంపాపేట: రంగారెడ్డి జిల్లాలోని ప్రతీ బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం చంపాపేటలోని ఆయన నివాసంలో పార్టీ మహిళా విభాగ క్రియాశీలక కార్యకర్తల సమవేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడప గడపకూ తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మీర్‌పేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ అధ్యక్షురాలుగా కాట్నే పద్మశ్రీ కృష్ణ యాదవ్‌కు జిల్లా పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు జయమ్మ జారీ చేసిన నియామక పత్రాన్ని ఆయన చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి పార్టీ మహిళా విభాగ ప్రతినిధులు అరుణాదేవి, ప్రగతి, గంగమ్మ, గీత, కీర్తి , మండల స్థాయి క్రియాశీలక కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

లింగోజిగూడ: సీసీ కెమెరాలు నేరాల నియంత్రణతో పాటు ఏదైనా ఘటన జరిగితే నేరస్తులను వెంటనే గుర్తించేందుకు దోహదం చేస్తాయని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. డివిజన్ పరిధిలోని శివగంగా, శ్రీ శివగంగా కాలనీల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీల్లో నెలకొన్న ఎలాంటి సమస్య అయినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీల అధ్యక్షుడు అంబాల మల్లేష్, కరుణాకర్‌రెడ్డి, నాయకులు రాహుల్‌గౌడ్, స్వామి, రమేష్ చారి, శంకర్, సుందర్‌నారాయణ, అశ్విన్‌సింగ్, శివనేత, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా పనులు పూర్తి చేయండి

కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా వేగవంతంగా పూర్తిచేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులను కోరారు.డివిజన్ పరిధిలోని మానస ఎన్‌క్లేవ్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆదివారం కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి పనుల కారణంగా కాలనీల్లోని పలు ఇళ్ల పైపులు పగిలాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుందర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో మరిన్ని సదుపాయాలు



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆలయ ఈఓ శ్రీనివాస శర్మ, పాలక మండలి సభ్యులు

చంపాపేట: కర్మన్‌ఘాట్‌లోని శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయంలో భక్తుల విరాళాలతో పాటు దాతలు, ఆలయ పాలక మండలి సభ్యులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆలయ ఈఓ శ్రీనివాస శర్మ అన్నారు. ఆదివారం ఆలయలో రూ.42 లక్షల దేవాదాయ శాఖ నిధులతో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్, రాజు వేగేశ్నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.16 లక్షలతో తాగునీటి శుద్ధి కేంద్రం, దాత బసిగూడెం జంగారెడ్డి ఆధ్వర్యంలో రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన రేకుల షెడ్ తదితరాలను ఆయన ఆలయ పాలక మండలి సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస శర్మ మాట్లాడుతూ, ఇప్పటికే దాతల సహకారంతో స్వామివారి ఆలయ కోనేరు సుందరీకరణ, ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల నిర్వహణకు రేకుల షెడ్, ఆలయ ప్రాంగణంలో గ్రానైట్ బండలు, వాహనాల పూజా సదుపాయం కోసం రేకుల షెడ్, ప్రసాదాల విక్రయ భవనం వంటి సదుపాయాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, సభ్యులు చాతిరి మధుసాగర్, సతీష్, సురేష్‌గౌడ్, సురేందర్ రెడ్డి, తిరుమలేష్, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. ఉప్పల్ రోడ్లు

- అస్తవ్యస్తంగా వరంగల్ జాతీయ రహదారి
- నిత్యం అవస్థలు పడుతున్న వాహనదారులు



ఉప్పల్ విద్యుత్ జంక్షన్ వద్ద వరంగల్ జాతీయ రహదారి పరిస్థితి ఇది

ఉప్పల్: ఈ రోడ్డును చూడండి.. కాదు కాదు ఒక్కసారి ఈ దారి మీదుగా వెళ్లండి.. ఎక్కడో మారుమూల గ్రామాల్లో చూసినట్లు అనిపించడం లేదు.. అలా అనుకుంటే పొరపడినట్లే.. అదేనండి ఉప్పల్ మీదుగా వెళ్లే భూపాలపట్నం 163 జాతీయ రహదారి ఇది. ఉప్పల్ ఎలక్ట్రికల్ జంక్షన్ వద్ద రోడ్డు పరిస్థితి ఇలా మారింది. ఒక్కరోజు కాదు ఏళ్ల తరబడి ఇక్కడి ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నా అధికారులకు కనీసం చీమ కుట్టినట్లు కూడా అనిపించకపోవడం శోచనీయం. కంకర తేలి వెక్కిరిస్తున్నా పట్టింపు లేకుండా పోయింది.

కారిడార్ పూర్తయ్యేది ఎప్పుడో..

24 గంటల పాటు నిత్యం రద్దీగా ఉండే ఉప్పల్–వరంగల్ జాతీయ రహదారి యాదాద్రికి, వరంగల్ హన్మకొండ ఇతర ముఖ్యప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. నిత్య వీఐపీల తాకిడి కూడా ఉంటుంది. అయినా ఈ రహదారిని పట్టించుకునే నాథుడే లేడు. కారిడార్ రోడ్డు వెడల్పులో భాగంగా పనులు ప్రారంభించి వదిలేశారు. కారిడార్ పనులు పూర్తయితే గానీ రోడ్డు వేయలేమంటూ ఆర్‌అండ్‌బీ అధికారులు భీష్మించుకు కూర్చున్నారు. కానీ కారిడార్ పూర్తయ్యేది ఎప్పుడో.. ఈ రోడ్డుకు మోక్షం వచ్చేది ఎప్పుడో ఆ దేవుడికె తెలియాలి.

తాత్కాలికంగా రోడ్డు వేయాలని..

నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో కారిడార్ పనులు కొనసాగుతున్నాయి. ఒకపక్క బారికేడ్లు మరోపక్క కంకర తేలిన రోడ్డు.. మరోపక్క కబరస్తాన్ ఆపై రోడ్డు మీదకు చేరుతున్న మురుగు నీరు.. ఇంకేముంది రోడ్డంతా అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఉదయాన్నే స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి ట్రాఫిక్ అధికారులు శ్రమించాల్సి వస్తోంది. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నల్ల చెరువు వరకు దాదాపు 2 కిలో మీటర్ల వరకు రోడ్డంతా కంకర తేలి దుమ్ముతో నిండిపోయిన పరిస్థితి. కారిడార్ పనులు పూర్తయ్యే వరకు అర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా రోడ్డు వేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

‘కారు’ కనుమరుగవ్వడం ఖాయం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్



మహేశ్వరం: కేఎల్‌ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న శ్రీధర్ ముదిరాజ్ తదితరులు

మహేశ్వరం: నియోజకవర్గంలో కారు (బీఆర్‌ఎస్ పార్టీ కనుమరుగవ్వడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం కందుకూరు మండలం లేమూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఢిల్లీ శ్రీధర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన పలువురు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, గుల్వి జంగయ్య, దేవేందర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ముచ్చర్ల నర్సింహ, మహ్మద్ రహీం, రవీందర్, సుధాకర్, నర్సింహ,అశోక్, ఇస్తారి తదితరులున్నారు. డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, సరికొండ మల్లేష్, వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన మీర్‌పేట కార్పొరేటర్

బడంగ్‌పేట: వచ్చే పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ కనుమరుగు అవుతుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్ కార్పొరేటర్ నరేందర్ కుమార్ (నందు), ఆయన అనుచరులు ఆదివారం కారు దిగి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కేఎల్‌ఆర్ కండువా కప్పి ఆహ్వానించారు.

కంటిపై కునుకు కరువు!



దోమలకు నిలయంగా మారిన సరూర్‌నగర్



బస్తీలు, కాలనీల్లో దోమల విజృంభణ

- ఫాగింగ్‌పై ఎంటమాలజీ సిబ్బంది నిర్లక్ష్యం
- రోగాల బారిన బస్తీవాసులు

దిల్‌సుఖ్‌నగర్: దోమల విజృంభణతో సరూర్ నగర్, మలక్‌పేట సర్కిళ్ల పరిధిలోని ప్రజలు అవస్థలు పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సాయంత్రం అయితే చాలు కాలనీలు, బస్తీలపై దోమలు దండయాత్ర చేస్తున్నాయని సరూర్‌నగర్ చెరువు, మూసీ పరీవాహక ప్రాంత నివాసాల వారు వాపోతున్నారు. యాంటీ లార్వా ఆపరేషన్ బృందాలు ఉన్నా... అవి ఎక్కడా పని చేసిన దాఖలాలు లేవని, ఫలితంగా దోమలు తమకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయని, డెంగీ వంటి విష జ్వరాలకు గురవుతున్నామని వాపోతున్నారు.

ఫాగింగ్ చేయడం లేదని ఫిర్యాదులు..

సరూర్‌నగర్, మలక్‌పేట్ పరిధిలో దోమల నిర్మూలన కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రతి నెలా లక్షలాది రూపాయాలు ఖర్చు చేస్తున్నా.. దోమలు మాత్రం తగ్గడం లేదు. గత కొంత కాలంగా యాంటీ లార్వా ఆపరేషన్‌తో పాటు, ఫాగింగ్ చేయడం కూడా తగ్గించేయడంతో దోమల సమస్య బాగా పెరిగిపోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

◆ ఆర్‌కేపురం, సరూర్‌నగర్, ఓల్డ్‌మలక్‌పేట్, అక్బర్‌బాగ్, మూసారాంబాగ్ డివిజన్లలోని కాలనీలు, బస్తీల్లో కనీసం నెలకు రెండుసార్లు కూడా ఫాగింగ్ చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఫాగింగ్ చేయడం లేదంటూ ఎంటమాలజీ సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. అయినా.. పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

◆ అధికారులు ప్రణాళికాబద్ధంగా దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికలు కోరుతున్నారు.

దృష్టి సారించాం

దోమల వృద్ధి అధికంగా ఉంది. అందుకే ముందుగా చెరువులు, మూసీ పరీవాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి యాంటీ లార్వా ఆపరేషన్ ప్రారంభించాం. స్పెషల్ టీంలు ఏర్పాటు చేసి కాలనీలు, బస్తీల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం.

– సర్కిళ్ల ఎంటమాలజిస్టులు

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 13, వంకాయ 15, బెండ 50, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 26, క్యారెట్ 21, దొండ 40, ఆలు 23, ఉల్లి 19, గోకర 45, దోస 21, సొర 09, పొట్ల 18, అరటి 11, చిక్కుడు 45, అర్వి 50, మునగ 55, చిలగడదుంప 60, బీట్‌రూట్ 21, కీర 24, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 57. ఈ ధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

బీసీ యూత్ ప్రధాన కార్యదర్శిగా ప్రణీత్‌కుమార్

లింగోజిగూడ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ బీసీ యూత్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగోలు డివిజన్ జైపురి కాలనీకి చెందిన జి. ప్రణీత్‌కుమార్‌ను నియామిస్తూ జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రణీత్‌కుమార్ మాట్లాడుతూ, బీసీ యువకుల సమస్యలు పరిష్కరించడంతో పాటు వారి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడిన బీసీ యువతను చైతన్యవంతం చేసి వివిధ రంగాల్లో రాణించేలా తోడ్పాటు అందిస్తానని అన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు ఆర్.కృష్ణయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో సామల పాపిరెడ్డి గార్డెన్ దగ్గర నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలంయలో అభయాంజనేస్వామి గణపతి నవగ్రహ శిఖర ధ్వజ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ సామల రంగారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 10.38 గంటలకు హంపి పీఠాధిపతి పరమహంస విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామిజీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన చేస్తారని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

శాంతి భద్రతల విషయంలో రాజీపడొద్దు



మహేశ్వరం: శాంతిభద్రతల విషయంలో రాజీపడొద్దని.. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలు చేయాలని ఏసీపీ ఉమామహేశ్వర్‌రావుకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ సూచించారు. ఆదివారం ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు అక్బర్‌ఫాం హౌస్‌లో కేఎల్‌ఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డికి ఏసీపీకి మొక్క అందజేశారు.

తెలంగాణ అబ్బాయి..అమెరికా అమ్మాయి..



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సోదరుడు నారాయణ రెడ్డి కుమారుడు డాక్టర్ దేవిరెడ్డి నితిన్ వివాహం ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో అమెరికాకు చెందిన డాక్టర్ విట్నీ స్నిడర్‌తో ఘనంగా జరిగింది. వేడుకలకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పద్మానగర్ కాలనీ నూతన కార్యవర్గం



పద్మానగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

చంపాపేట: డివిజన్ పరిధిలోని పద్మానగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుభం జయవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బందా సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా వెంకటరెడ్డి, కోశాధికారిగా రామకిషన్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా ఉపేందర్‌రెడ్డి, యాదయ్య గుప్తా, ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా మహిపాల్‌రెడ్డి, వంశీరావు, శ్రీనివాసరెడ్డి, ప్రకాష్, వాసు, వెంకటయ్యలను కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు జయవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, సర్కిల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, తాజా, మాజీ కాలనీ కమిటీ సభ్యుల సహకారంతో కాలనీలో పడకేసిన పారిశుద్ధ్యం, విస్తరణకు నోచుకోని భూగర్భ డ్రైనేజీ, గంతలు పడ్డ కాలనీ అంతర్గత రహదారులు వంటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

ఘనంగా సేవలాల్ జయంత్యుత్సవాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ఘనంగా నిర్వహించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె బంజారులకు సంత్ సేవాలాల్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. మేయర్ దుర్గా దీప్‌లాల్, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో..

స్థానికంగా జెడ్పీహెచ్‌ఎస్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ పారిజాతారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంజారులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

హుడాకాంప్లెక్స్: సరూర్ నగర్ శ్రీ త్రివేణి పాఠశాల పదవ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు యోగా విన్యాసాలతో చూపరులను కట్టిపడేశారు. మన సంస్కృతి,సాంప్రదాయాలకు పెద్దపీట వేసే కార్యక్రమాలతో విద్యార్థుల ప్రదర్శన కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సైకాలజిస్ట్, సహజ ఫౌండేషన్ చైర్మన్ శైలజ మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు పిల్లలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే సలహాలు, సూచనలు అందించారు. పిల్లలు మొబైల్ వాడే స్థితిని గమనించాలని, రోజూ పిల్లలతో గడపాలని, పెద్దలను గౌరవించాలని, పిల్లలలో మంచి గుణాలుపెంపొందించేలా కథలను నిద్రపోయే సమయంలో వినిపిస్తే అవి వారికి జీవితాంతం గుర్తుంటాయన్నారు. శ్రీ త్రివేణి సంస్థల చైర్మన్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సందేశాత్మక ప్రదర్శనలను చూపారని కొనియాడారు. పిల్లల్లో నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సునీల్, ప్రధానోపాధ్యాయులు యోగేశ్వరి, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు



హుడాకాంప్లెక్స్: వీధి కుక్క దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. నల్లగొండ జిల్లా తిరుమలగిరికి చెందిన కొమ్మ మధు బతుకుదెరువు కోసం కుటుంబంతో కలిసివచ్చి సరూర్ నగర్ డివిజన్ పరిధి జింకల బావి కాలనీలో నివసిస్తున్నారు. బట్టల దుకాణంలో గుమస్తాగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని కుమారుడు వినీత్ (7) సరూర్ నగర్‌లోని లయోలా స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. రోజుమాదిరిగానే ఆదివారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్క దాడి చేసింది. దీంతో బాలుడి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స కోసం లక్ష రూపాయలు కర్చవుతుందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముస్తాబు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని క్యాంపు కార్యాలయం కొత్త ఎమ్మెల్యే కోసం ముస్తాబు అవుతోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయాలను నిర్మించిన సంగతి తెలిసిందే. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారికి సమీపంలో ఖానాపూర్ గ్రామ పరిధిలో ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయాన్ని నిర్మించారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇక్కడ ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపొందారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కార్యాలయాన్ని ఖాళీ చేశారు. ఈ నేపథ్యంలో కొత్త ఎమ్మెల్యేగా ఎన్నికైన మల్‌రెడ్డి రంగారెడ్డి కొలువు దీరేందుకు క్యాంపు కార్యాలయాన్ని అన్ని హంగులతో ముస్తాబు చేస్తున్నారు. పాత టైల్స్‌ను తొలగించి కొత్త వాటిని వేశారు. శానిటరీ, ఎలక్ట్రికల్, పార్కింగ్ టైల్స్, పెయింటింగ్ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి. సుమారు రూ.15 లక్షల నిధులతో కార్యాలయ మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రవణ్ ప్రకాశ్, డీఈఈ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈఈ వినోద్ పనులను పర్యవేక్షిస్తున్నారు. త్వరలోనే ఎమ్మెల్యే మల్‌రెడ్డి క్యాంపు కార్యాలయ గృహ ప్రవేశాన్ని చేయనున్నారు.

బీసీలపై కొనసాగుతున్న వివక్ష

కాచిగూడ: తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన సమగ్ర కుల గణన తీర్మానాన్ని స్వాగతిస్తున్నామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ అన్నారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కులగణన తీర్మానం అస్పష్టంగా ఉందని, దీనికి జ్యుడీషియల్ కమిషన్ లేదా ప్రత్యేక బిల్లు ప్రవేశ పెడితే తెలంగాణ ప్రజలకు ఉపయోగకరంగా ఉండేదన్నారు. తెలంగాణలో ప్రభుత్వం మారినా బీసీలపై వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌటుపల్లి సురేష్, తెలంగాణ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ జలపల్లి కిరణ్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు పండరీనాథ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ అతిథిగా హాజరై స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను స్థానికులు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీహెచ్ భద్రారెడ్డి, పల్లె నర్సింగరావు, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రామామృతం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అభినేత్రి ఆర్ట్స్ అకాడమీ, పరంపరల సంయుక్తాధ్వర్యంలో రామామృతం పేరిట ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించిన నృత్య విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు కళా ప్రముఖులు మాట్లాడుతూ..శాస్త్రీయ సంగీత కళలను నేటి యువతరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. త్యాగరాజ అన్నమయ్య కీర్తనలకు కళాకారుల నృత్యాలు కనువిందు చేశాయి. అంతా రామమయం పేరిట సాగిన పల్లకి సేవా అలరించింది. ఈ కార్యక్రమంలో పరంపర ప్రతినిధులు శశి రెడ్డి, కళాకృష్ణ అభినేత్రి ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపకుడు ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

సామాజిక వికాస ఉద్యమాలకు ఆద్యుడు భాగ్యరెడ్డి వర్మ

సుల్తాన్‌బజార్: దేశంలోని దక్కన్ పీఠభూమి కేంద్రంగా ఎన్నో సామాజిక సంస్కరణలు, ఉద్యమాలకు ఆద్యుడిగా భాగ్యరెడ్డి వర్మ నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం చాదర్‌ఘాట్‌లోని ఆది హిందూ భవన్‌లో భాగ్యరెడ్డి వర్మ స్మారకోపాన్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ పాత్రికేయుడు కె.శ్రీనివాస్, భాగ్యరెడ్డి వర్మ మెమోరియల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బాల నరసింహ తదితరులు హాజరై ప్రసంగించారు. చీకటి నుంచి వెలుగు పంచిన జ్ఞాన యోధుడిగా భాగ్యరెడ్డి వర్మను అభివర్ణించారు. ప్రథమ ఆంధ్ర మహాసభ, తెలంగాణ సాయుధ పోరాటం, నిజాం వ్యతిరేక ఉద్యమానికి భాగ్యరెడ్డి వర్మ మొదలు పెట్టిన ఆది హిందూ ఉద్యమమే పునాదిగా అభిప్రాయపడ్డారు. ఆర్య సమాజం, బ్రహ్మ సమాజంతో కలిసి పనిచేస్తూనే 1917లో విజయవాడలో జరిగిన పంచమం మహాసభకు వక్తగా వెళ్లి సమాజాన్ని చైతన్యవంతం చేసిన నేతగా ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు.

బ్రోచర్ ఆవిష్కరణ

అబిడ్స్: మహా శివరాత్రి జాగరణ్ సేవా సమితి ఆధ్వర్యంలో మహా జాగరణ్ మహోత్సవ బ్రోచర్లను ఆవిష్కరించారు. రహింపురాలో జరిగిన కార్యక్రమంలో జాగరణ్ సమితి అధ్యక్షుడు మాడిశెట్టి సదానందంగుప్తా, మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐలు సాయికృష్ణ, సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి రాజన్‌కుమార్, కోశాధికారి రాజేందర్‌సింగ్, రంజిత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదానందం గుప్తా మాట్లాడుతూ..ఈ సంవత్సరం మహా శివరాత్రి జాగరణ్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ వర్మ, శైలేందర్ సింగ్, ప్రదీప్ కుమార్, బాల్‌రాజ్ గౌడ్, పురుషోత్తమ్ సింగ్, శ్రవణ్‌కుమార్, సందీప్ బుక్కా, నరేష్ గుప్తా, నితిన్‌రాజ్, నవీన్, నర్సింగ్‌రావు, గోపాల్‌సింగ్, ఓం ఠాకూర్ పాల్గొన్నారు.